

కాలగమనంలో రెండు క్యాలెండర్లు చిరిగిపోయాయి. సుబ్రావ్‌కు తన పేరు అచ్చులో చూసుకోవాలన్న కోరిక, మనవడు ఇంటివాడైతే చూసి తరించాలన్న బామ్మ కోరిక రెండూ తీరాయి. కాకపోతే- బామ్మ బకెట్ తన్నేసే కార్యక్రమాన్ని మునిమనువడి కోసం పోస్ట్‌పోన్ చేసుకుంది.

ఇక అసలు విషయానికి వస్తే-

సుబ్రావ్ జీవిత ధ్యేయం నెరవేరడానికి కారణం.. తన ప్రాణ స్నేహితుడు ఉచిత్‌రావ్ ఉచిత సలహా పాటించడమే. సలహా అయితే ఉచితంగా దొరికింది కాని.. దానిని ఆచరించడానికి తాతలనాటి రెండెకరాల మాగాణి ఖర్చయిపోయింది.

ఉచిత్‌రావ్ ఉచిత సలహా ఏమిటంటే.. కథలు పత్రికలకు పంపించడానికి, తిరిగి పొందడానికి అయ్యే పోస్టల్ ఖర్చులు, తిరిగొచ్చిన కథలను తిరగ రాసి మరో పత్రికకు పంపించడానికి, ఆ తర్వాత మరో పత్రికకు.. అలా ఒక సంవత్సర కాలానికి అయ్యే ఖర్చు లెక్కేస్తే... అంతకన్నా తన కథలను తనే ఒక సంపుటిగా ప్రింట్ చేసి మార్కెట్ మీద వదిలెయ్యడమే మేలని-

ఆ ఆలోచన ఎంత బాగా క్లిక్ అయిందంటే.. ఇప్పుడు సుబ్రావ్ పేరు వినని పోలీసు, తెలియని లాయరు, కథ(లు) చదవని నేరస్తుడు ఉండరంటే అతిశయోక్తి కాదు. నేరస్తుల చేత నిజం చెప్పించడానికి, థర్డ్ డిగ్రీ ట్రీట్‌మెంట్ ఫెయిలయితే, పోలీసులు ఫోర్త్ డిగ్రీగా సుబ్రావ్ కథలను నేరస్తుల చేత చదివిస్తారు. అదేమి మాయో కాని, మొదటి కథకు కడుపులోంచి తిన్నదంతా తన్నుకొని బయటపడితే, రెండో కథకు కడుపులో దాచుకున్న నిజాలు బులెట్స్‌లా బయటకు దూసుకు వస్తాయి. నేరస్తులను కఠినంగా శిక్షించవలసి వస్తే, యావజ్జీవ కారాగారశిక్షతోపాటు సుబ్రావ్ కథలను కూడా భారత శిక్షాస్మృతిలో చేర్చాలని మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రికమండ్ చేసింది.

మన సుబ్రావ్ మాత్రం రెట్టించిన ఉత్సాహంతో కలంతో కాగితాలపై రెచ్చిపోతూనే ఉన్నాడు. *

**ముంతా సురేష్‌బాబు**

పవర్ పాలిటిక్స్

# సంకుచిత దృష్టి కాదు, దూరదృష్టి కావాలి!

**రాజకీయాలను 'ప్రాక్టికల్ బిజినెస్' అంటారు. అంటే వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో, అహాలతో పనిలేకుండా ఏది చేస్తే లాభమో, ఎవరితో పొత్తు లాభకరమో నిస్సంకోచంగా అలా ప్రవర్తించడమన్నమాట. ఏ పనిచేస్తే ప్రజలను ఆకర్షించి ఓట్లు సంపాదించగలరో ఆ పని ఆలోచించి చేయడమన్నమాట.**

మన రాజకీయనాయకులు ఈ 'ప్రాక్టికల్ బిజినెస్'లో ఆరితేరినవారు. ఎన్నికల వరకూ ఏ అంశాన్ని ప్రాణమన్నట్టు వ్యవహరించారో, అవసరమైతే అధికారం కోసం ఆ అంశం తనకు తెలియదన్నట్టే ప్రవర్తించగలరు. ఎన్నికల ముందు వరకూ ఎవరు తనకు బద్ధశత్రువులో, అధికారం దక్కుతుందనిపిస్తే వాళ్ళని మించిన ప్రాణస్నేహితుడు మరొకడు లేడన్నట్టు ప్రవర్తించగలరు. కానీ ఉత్తరప్రదేశ్‌లో రాజకీయాలు చూస్తే ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించటం కోసమే తాము బ్రతికి ఉన్నామన్నట్టు ప్రవర్తించే నాయకులకు ప్రజల గోడు పట్టదని, వ్యక్తిగత లాభాలు, అహంకారాల ముందు ప్రజల ఆకాంక్షలు దిగదుడుపేనని అర్థమౌతుంది. ఈ రకం 'పవర్ పాలిటిక్స్' అర్థమవాలంటే ఒక్కసారి ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాజకీయ రంగాన్ని పరామర్శించాల్సి ఉంటుంది.


## ఎన్నికల ముందు - తర్వాత

ఎన్నికల ముందు ప్రతి పార్టీ విజయం తనదేనన్నట్టు ప్రవర్తించింది. సమాజ్‌వాది పార్టీకి ఈసారి సీట్లు అధికంగా వస్తాయని ఊహించినా, ప్రభుత్వం ఏర్పరచేంత మెజారిటీ ఎవరికీ రాదు కాబట్టి, ఎన్నికల తరువాత సంకీర్ణ ప్రభుత్వం తప్పని సరి అని ముందే తెలుసు. అందుకే పార్టీలు తమ తమ మిత్రులతో పొత్తులు ఏర్పరచుకుంటున్నా, ఎన్నికల తరువాత ఎవరితో కలవాలని చర్చిస్తూనే వున్నాయి. ఉత్తరప్రదేశ్ రాజకీయాలలో నాలుగు ప్రధాన పార్టీలున్నాయి. బిజెపి, ఎస్పీ, బిఎస్పీ, కాంగ్రెస్‌లు. వీరంతా ఒకప్పుడు కలిసి ప్రభుత్వాలు ఏర్పరచిన వారే. ఏదో ఒక సందర్భంలో కలిసి పనిచేసి విడిపోయిన వారే. ములాయం సింగ్, మాయావతిలు కలిసి బిజెపిని ఓడించారు. కానీ ఎక్కువ కాలం కలిసి వుండలేకపోయారు. ఆపై రెండుసార్లు బిజెపి, బిఎస్పీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఈ రెండు పార్టీలు కలవటం వెనుక ప్రధానోద్దేశ్యం ములాయం అధికారానికి రాకుండా చూడటం. ఎందుకంటే అధికారంలో ఉన్నన్నాళ్ళూ ములాయం ఈ రెండు పార్టీలను భయభ్రాంతులను చేశాడు. వారి మనుగడను ప్రశ్నార్థకంలో పడేశాడు. అందుకని ఎట్టి పరిస్థితులలో ములాయంకు అధికారం దక్కనివ్వద్దన్న ఉద్దేశ్యంతో బిజెపి, మాయావతి చేతులు కలిపారు. కానీ మాయావతికి తనకే అధికారం కావాలి. అలాగని అధికారం లభించేందుకు తోడ్పడిన వారితో జాగ్రత్తగా వ్యవహరించటం తెలియదు. ఆరు నెలలకు ముఖ్యమంత్రి పదవి మార్చుకునేట్టు ఒప్పందాలు చేసుకున్నా, తన వంతు తరువాత అధికారం వేరే వారికి అప్పగించటం నచ్చదు. పైగా అధికారంలో ఉన్న ఆరు నెలల్లోనే ఆరేళ్లకు సరిపడా పనులు సాధించేసి, అవకాశం ఉన్నప్పుడే తన ఓట్ల బ్యాంకులను స్థిరపరిచేసుకోవాలన్న ఆత్రం ప్రదర్శించింది. ఇది ఆమె మిత్రపక్షం బిజెపికి ప్రమాదకరం. ఎందుకంటే కేవలం మాయావతికి మద్దతునిచ్చిన కారణానికి ఆమె ప్రభుత్వ అవకతవకలన్నిటికీ బిజెపి బాధ్యత వహించాల్సి వస్తుంది. పైగా అధికారం కోసం ఆశపడి, బిజెపి సభ్యులు ఆ పార్టీ వైపు ఆకర్షితులవవచ్చు. ఇలా ములాయం వ్యతిరేకత వారిని దగ్గర చేసినా ఆ రెండు పార్టీల మధ్య వైరుధ్యాలు బిజెపి, బిఎస్పీలను దూరం చేశాయి. అధికార దాహం బిఎస్పీ సభ్యులను, కాంగ్రెస సభ్యులను బిజెపి వైపు ఆకర్షితులను చేసింది. దాంతో బిజెపి అధికారాన్ని చేపట్టింది. ఇతర పార్టీలను చీల్చి సంఖ్యాబలం పెంచుకున్న బిజెపి, పాలనపై కన్నా తన దృష్టిని కుర్చీని నిలుపుకోవటం వైపే కేంద్రీకరించింది. చివరికి ఎన్నికలు దగ్గర పడుతున్నాయనగానే అప్పుడు మేల్కొని హడావిడిగా ప్రజాకర్షక పథకాలు ప్రకటించేసింది. కానీ అప్పటికే ములాయం - మాయావతి తమ ఎన్నికల ప్రచారం ఆరంభించేశారు.

## మిత్రులతో బిజెపికి నష్టం

ప్రభుత్వంలో ఉన్న బిజెపి ఎన్నికల ప్రచారం ఆరంభించేలోగా ములాయం, మాయావతి తమ అభ్యర్థుల పేర్లు ప్రకటించేశారు కూడా. ములాయం 295 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించేసి మిగిలిన 108 సీట్లను పీపుల్స్‌ఫ్రంట్ మిత్రులు- సిపిఐ, సిపిఐ (ఎం)లతో కలిసి చర్చించిన తరువాత ప్రకటించాడు. ములాయం ఇలా ఏకపక్ష నిర్ణయం తీసుకోవటం మిత్రపక్షాలకు కోపం తెప్పించినా వారు కోపం ప్రదర్శించలేకపోయారు. అలాగే మాయావతి కూడా ముందుగా 400 సీట్లకు అభ్యర్థుల పేర్లు ప్రకటించేసింది. మిగతా మూడింట్లో రెండు స్థానాలు తనే పోటీ చేసింది. ఈ రకంగా

## పంజాబ్‌లో అమరిందర్‌కు అధికారం



**పంజాబ్ కొత్త ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్ 1997లో కాంగ్రెస్‌లో చేరినప్పుడు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా వుంది. ఎన్నికలలో ఘోర పరాజయం పొందిన పార్టీ విషాదయోగంలో వుండేది. అటువంటి సమయంలో కాంగ్రెస్‌లో ప్రవేశించి, పార్టీ ప్రాంతీయ నాయకుడై ఐదేళ్లలోగా ఎన్నికలలో ఘన విజయం సాధించే స్థాయికి తెచ్చిన ఘనత పాటియాలా మహారాజు అమరిందర్ సింగ్‌ది. డూన్ స్కూల్లో చదువు, నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, ఇండియన్ మిలటరీ అకాడెమీ నుంచి పట్టభద్రుడై సైన్యంలో చేరాడీయన. 1965లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాడు. ఒకప్పటి పంజాబ్ చీఫ్ సెక్రటరీ గ్యాన్‌సింగ్ కహ్లోన్ కూతురు పుర్నీత్‌ను వివాహమాడాడు. ఈమె పాటియాలా నుంచి పార్లమెంటుకు ఎన్నికైంది. 1970లో అమరిందర్‌సింగ్ కాంగ్రెస్‌లో చేరాడు. 1980లో పార్లమెంటు సభ్యుడయ్యాడు. స్వర్ణమందిరంపై సైనిక చర్యకు నిరసనగా కాంగ్రెస్‌ను వదలి అకాలీదళ్‌లో చేరాడు. 1985లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. కానీ అకాలీదళ్ రాజకీయాల్లో ఇమడలేకపోయాడు. 1986లో దర్బారా సాహిబ్ కాంప్లెక్స్‌లో ఆర్మీ ప్రవేశానికి నిరసనగా మంత్రి పదవి నుంచి రాజీనామా చేసినా 1991 వరకూ అకాలీదళ్‌లో సభ్యుడిగా ఉన్నాడు. 1997 ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరాడు. ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపడుతూ ఈయన పంజాబ్ ఆర్థిక స్థితి మెరుగుపరచటం తక్షణ కర్తవ్యం అన్నాడు. పంజాబ్ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం 2,300 కోట్ల లోటు వుంది. ఈ లోటును పూడ్చకపోతే రాబోయే కాలంలో ప్రభుత్వం ఆర్థికంగా కష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది.**